గౌలిదొడ్డి గురుకుల విద్యాలయాన్ని సందర్శించిన బీఆర్ఎస్ నేతలు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, జగదీశ్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, గువ్వల బాలరాజు, బాల్క సుమన్ తదితరులు

గురుకుల విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం

- విద్యాసంవత్సరం మధ్యలో ఫ్యాకల్టీ తొలగింపా?
- సర్కారుపై జగదీశ్‌రెడ్డి, కొప్పుల, ఆర్ఎస్పీ ఆగ్రహం
- గౌలిదొడ్డి గురుకులాన్ని సందర్శించిన బీఆర్ఎస్ నేతలు

శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 6: గౌలిదొడ్డి గురుకుల విద్యార్థుల జ్ఞానం ముందు కాంగ్రెస్ సీఎం, మంత్రుల జ్ఞానం సరిపోవటం లేదని, ఆ విద్యార్థులను చూసి బుద్ధి తెచ్చుకోవాలని మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం గౌలిదొడ్డి గురుకుల విద్యాలయాన్ని బీఆర్ఎస్ తరపున మాజీమంత్రులు జగదీశ్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ ఎంపీలు బాల్కసుమన్, గువ్వల బాల్‌రాజ్, మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ సందర్శించారు. ఈ సందర్భంగా రోడ్డెక్కిన గౌలిదొడ్డి బాలుర ఐఐటీ అకాడమీ, బాలికల గురుకుల కళాశాల విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. అనాలోచిత నిర్ణయాలు తీసుకొని విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న సీఎం, మంత్రులు జ్ఞానం నేర్చుకొనేందుకు ఈ గురుకులానికి రావాలని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ హయాంలో దేశంలోనే టాప్-10 స్కూళ్లకు పోటీగా నిలిచిన గురుకులాలు.. నిర్వహణలోపంతో ఇప్పుడు విద్యార్థులు టీసీలు తీసుకొని వెళ్లిపోతున్నారు' అని వెల్లడించారు.

9 నెలల్లో 37 మంది విద్యార్థులు మృతి

కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ.. ఇటీవల జగిత్యాల జిల్లాలోని పెద్దాపూర్‌లో ఇద్దరు చిన్నారులు చనిపోయారని గుర్తుచేశారు. రాష్ట్రంలో 9 నెలల కాలంలో 37 మంది పిల్లలు గురుకుల పాఠశాలల్లో చనిపోయారని ఆవేదన వ్యక్తంచేశారు. ఎస్సీ, ఎస్టీలకు నాణ్యమైన విద్యను దూరం చేయాలని కాంగ్రెస్ సర్కారు కుట్ర చేస్తున్నదని ఆర్ఎస్పీ మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో ఇదే పాఠశాల నుంచి వందల మంది గొప్ప వర్సిటీలకు వెళ్లారని, నేడు రోడ్డు మీదికి వచ్చి ధర్నాలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ విద్యార్థి సంఘం నాయకుడు శ్రీనివాస్, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ సాయిబాబా తదితరులు ఉన్నారు.

గౌలిదొడ్డిలోని గురుకుల కళాశాలలో ఆందోళన చేస్తున్న విద్యార్థులు, సిబ్బంది

భగ్గుమంటున్న బాసర ట్రిపుల్ ఐటీ

మూడు రోజులుగా విద్యార్థుల ఆందోళన

17 డిమాండ్లు తీర్చాలంటూ పోరుబాట

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గోడ దూకి రేవంత్ సంఘీభావం

అధికారంలోకి వచ్చాక పట్టించుకోని సీఎం

బాసర, సెప్టెంబర్ 6: బాసరలోని రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక యూనివర్సిటీ (ఆర్‌జీయూకేటీ) విద్యార్థులు మళ్లీ ఆందోళనబాట పట్టారు. గత మూడు రోజులు ఆందోళన చేస్తున్న విద్యార్థులు వర్షాన్ని సైతం లెక్క చేయకుండా శుక్రవారం క్యాంపస్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు రెండు వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. ట్రిపుల్ఐటీ ప్రధాన ద్వారం ముట్టడికి ఏబీవీపీ నాయకులు ప్రయత్నించగా, సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఇరువర్గాల మధ్య జరిగిన తోపులాటలో పలువురు ఏబీవీపీ కార్యకర్తలకు గాయాలయ్యాయి. వీసీ రాజీనామా చేయాలని, రెగ్యులర్ వీసీని వెంటనే నియమించాలంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. 17 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని యూనివర్సిటీ అధికారులకు అందజేశారు. తమ డిమాండ్లు నెరవేర్చేంత వరకు ఆందోళన కొనసాగిస్తామని, గతంలో మాదిరిగా ధర్నా చేస్తామని ట్రిపుల్ఐటీ విద్యార్థుల సంఘం (టీఎస్ఏఎస్) హెచ్చరించింది.

నాడు గోడ దూకిన రేవంత్

తమ సమస్యలను పరిష్కరించాలంటూ రెండేండ్ల క్రితం ఆందోళన చేస్తున్న విద్యార్థులకు సంఘీభావం తెలిపేందుకు అప్పటి పీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి బాసర ట్రిపుల్ ఐటీకి రాగా, పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఆయన పోలీసులను తప్పించుకొని గోడ దూకి ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలోకి ప్రవేశించారు. విద్యార్థుల ఆందోళనకు మద్దతు తెలిపారు. ఇప్పుడు అదే రేవంత్‌రెడ్డి సీఎం అయినా తమ సమస్యలను పట్టించుకోవడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇన్‌చార్జి వీసీ వెంకటరమణ స్థానికంగా ఉండటం లేదని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

కేసీఆర్ ఆనవాళ్లను తుడిచే కుట్ర

- గురుకులాల నిర్వీర్యం అందులో భాగమే
- బడుగులకు విద్యను దూరం చేసే కుట్ర
- ఇంటర్నేషనల్ గురుకులాలు కాదు.. ఉన్నవాటిని బాగుచేయాలి
- ప్రస్తుత పనివేళలు అశాస్త్రీయం
- 'నమస్తే తెలంగాణ' ఇంటర్వ్యూలో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

హైదరాబాద్, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ): 'తెలంగాణ గురుకులాల్లో నెలకొంటున్న సమస్యలన్నింటికీ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం. బడుగులకు విద్యను దూరం చేసే కుట్రలో భాగంగానే గురుకులాలను భ్రష్టుపట్టిస్తున్నది. ఇటీవల ప్రభుత్వం తీసుకుంటున్న వరుస నిర్ణయాలే అందుకు నిదర్శనం' అని బీఆర్ఎస్ నాయకుడు, తెలంగాణ గురుకుల సొసైటీల మాజీ కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇంటర్నేషనల్ గురుకులాలను ఏర్పాటు చేయడం కాదు.. ప్రస్తుత గురుకులాలను ఇంటర్నేషనల్ స్థాయికి తీసుకెళ్లాలని సీఎం రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. మరింత మెరుగైన వసతులు కల్పించడంతో పాటు శాస్త్రీయమైన పనివేళలను ప్రవేశపెట్టి ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించాలని సూచించారు. ప్రభుత్వ కుట్రలపై బడుగు, బలహీనవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు, కులసంఘాలు, విద్యార్థి సంఘాలు తక్షణం స్పందించాలని శుక్రవారం ఆయన 'నమస్తే తెలంగాణ'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పిలుపునిచ్చారు. ఇంటర్వ్యూలోని ముఖ్యాంశాలు.

తెలంగాణ గురుకులాల ప్రత్యేకత ఏమిటి?

ఇవి రాత్రికి రాత్రి పుట్టినవి కావు. మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు హయాంలోనే పురుడుపోసుకున్నవి. కేసీఆర్ వాటిని మరోమెట్టుకి తీసుకెళ్లారు. దేశానికే ఆదర్శ నమూనాగా నిలిపారు. సొసైటీ సెక్రటరీలందరికీ పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. అందుకు ఎస్సీ, ఎస్టీ గురుకుల సొసైటీలోని సీవోఈ (సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్) సాధించిన విజయాలే సాక్ష్యం. గురుకులాల్లోని ప్రతిభావంతులైన విద్యార్థులను అనేక రకాలుగా వడబోసి ఈ సీవోఈల్లోకి ఎంపిక చేస్తారు. ఇంటర్ విద్యతోపాటు నీట్, జేఈఈ కోచింగ్ ఇస్తారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సీవోఈల్లోని పేదపిల్లలకు ప్రత్యేక కోచింగ్ ఇప్పించింది. మైక్రో షెడ్యూల్‌ను ఏర్పాటు చేసి, ప్రత్యేకంగా సబ్జెక్ట్ అసోసియేట్లను నియమించి రెండేండ్లపాటు ఆయా ఎంట్రెన్స్ ఎగ్జామ్స్‌ను క్రాక్ చేసేందుకు కావాల్సిన మెళకువలపై తర్ఫీదు ఇచ్చింది. ఇది విజయవంతమైన ప్రయోగం. సీవోఈల నుంచి దాదాపు మూడు వేల మందికిపైగా విద్యార్థులకు నీట్, జేఈఈ ర్యాంకులు సాధించారు. ప్రతిష్ఠాత్మకమైన జాతీయ, అంతర్జాతీయ సంస్థల్లో చేరి డాక్టర్లుగా, ఇంజినీర్లుగా, శాస్త్రవేత్తలుగా ఎదిగారు. నీట్ కోసం ఆపరేషన్ బ్లూ క్రిస్టర్, ఆపరేషన్ ఎమరాల్డ్ ఇట్లా అనేక ప్రయోగాలను నిర్వహించాం. కేసీఆర్ ఆ స్వేచ్ఛ ఇచ్చారు. విద్యార్థుల కోచింగ్‌కు నిధుల కొరత లేకుండా చూశారు. ఫలితంగానే దేశంలో ఏ గురుకుల సొసైటీకీ సాధ్యం కాని విజయాలు తెలంగాణ గురుకుల సొసైటీలకు సొంతమయ్యాయి.

కాంగ్రెస్ విధానాలు ఎలా ఉన్నాయి?

కేసీఆర్ ఆనవాళ్లను చెరిపేస్తామని బాహాటంగా ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఆచరణలో చేసి చూపుతున్నారు. గురుకులాలపై కేసీఆర్ ముద్రను చెరిపేయాలనే కక్షతో బడుగు, బలహీనవర్గాల పిల్లలకు ఉన్నతవిద్యను దూరం చేసే కుట్రకు తెరలేపారు. తన సొంత నియోజకవర్గం కొడంగల్‌లోని చాలా గురుకులాల్లో టీచర్లే లేరంటే రేవంత్‌రెడ్డి పర్యవేక్షణ ఎలా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. సీవోఈల్లో గతంలోనూ రెగ్యులర్ స్టాఫ్ ఉండేది. వారితో ప్రయోగాలు చేశాం. ఫలితాలు రాకపోవడంతో వారితోపాటు సబ్జెక్టు అసోసియేట్లను ఏర్పాటుచేశాం. ఎంట్రన్స్ కోచింగ్ ఇప్పించాం. ఆ సబ్జెక్ట్ అసోసియేట్లను తొలగించడమంటే గురుకులాలను నిర్వీర్యం చేయడమే. ప్రభుత్వ పెద్దల అండ, ప్రోత్సాహం లేకుండా విద్యార్థుల భవిష్యత్‌ను విఘాతపరిచే ఇలాంటి నిర్ణయాలను అధికారులు ఎలా తీసుకుంటారు? ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి గురుకుల విద్యావ్యవస్థపై అవగాహన లేదు.

పనివేళల మార్పుపై మీ అభిప్రాయం?

గురుకులాల పనివేళలను మార్చడం పూర్తిగా అశాస్త్రీయం. ఉపాధ్యాయుడు ఎంత ప్రశాంతంగా, సంతోషంగా, ఉత్సాహంగా ఉంటే తరగతి గదిలో విద్యార్థికి అంత ప్రేరణగా నిలుస్తాడు. ఇష్టంగా పాఠాలు చెప్పి విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దుతారు. ఇప్పుడు మార్చిన పనివేళలతో గురుకులాల్లో ఆ ఆహ్లాదకర వాతావరణమే మారిపోయింది. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఉండాలంటే ఉపాధ్యాయులు ఎంతో అసౌకర్యంగా గురవుతున్నారు. అది అంతిమంగా గురుకుల విద్యార్థులు, గురుకుల విద్యావ్యవస్థకే చేటు చేస్తుంది. విద్యార్థులపై ఒత్తిడిని దూరం చేసేందుకంటూ ప్రభుత్వమే మళ్లీ ఆధ్యాత్మిక సంస్థలతో మోటివేషనల్ క్లాస్‌లను నిర్వహించాలని చూడటమే విచిత్రం. ఇది తీవ్ర అభ్యంతరకరం. పాఠశాల అనేది లౌకికభావాలకు నిలయం. అవసరమైతే గతంలో మాదిరి కౌన్సిలర్లతో మోటివేషనల్ తరగతులు చెప్పించాలి. గతంలో గురుకుల సొసైటీలో ఏ విధానం అమలు చేయాలన్నా, తొలుత పైలట్ ప్రాజెక్టుగా ఎక్కడో ఒకచోట ఏర్పాటు చేసి, ఫలితాలను సమీక్షించి ఆపై అన్ని గురుకులాల్లో అమలు చేసేవాళ్లం. ఇప్పుడు సర్కారుకు ఆ విధానమే లేదు. ఇప్పటికైనా పనివేళలను పునఃసమీక్షించాలి.

స్పోర్ట్స్ వర్సిటీపై మీ అభిప్రాయం?

కాంగ్రెస్ సర్కార్ తీసుకున్న మరో హాస్యాస్పద నిర్ణయం. గ్రామీణస్థాయిలో, విద్యార్థిదశ స్థాయిలో క్రీడలను ప్రోత్సహించకుండా స్పోర్ట్స్ వర్సిటీ ఏర్పాటు చేస్తామంటే ఏమనాలి? రాష్ట్రంలో ఏ సొసైటీలో లేనివిధంగా ఎస్సీ, ఎస్టీ గురుకుల సొసైటీ ఆధ్వర్యంలోనే దాదాపు 60 స్పోర్ట్స్ అకాడమీలు ఉన్నాయి. ఈ అకాడమీలకు చెందిన విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో 32 పతకాలు, జాతీయస్థాయిలో 1,500కుపైగా పతకాలు సాధించారు. ఇటీవల స్పోర్ట్స్ అకాడమీకి చెందిన జుడోక్ క్రీడాకారుడు తిరుపతి అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ ప్రభుత్వం ఒక్క రూపాయి ఇవ్వలేదు. విషయాన్ని తెలుసుకున్న కేటీఆర్ ఆ క్రీడాకారుడికి అయ్యే ఖర్చులన్నీ భరిస్తున్నారు. నందిని అనే నిరుపేద, రజక కుటుంబానికి చెందిన క్రీడాకారిణి అథ్లెట్ ఏషియన్ గేమ్స్‌లో ప్రతిభ చూపింది. బాక్సర్ నిఖత్ జరీన్‌కు ఇచ్చినట్టు ఆ క్రీడాకారిణికి ప్రోత్సాహకం ఇవ్వలేదు. సరే అవేవీ లేవు అనుకున్నా ఏకంగా ఆ అకాడమీలను మూసేందుకు కుట్రపన్నింది. అకాడమీల్లోని హానరోరియం ఉద్యోగులందరినీ తొలగించాలని పూనుకోవడం అందులో భాగం కాదా?

ఇంటర్నేషనల్ గురుకులాలకు అర్థమేంటి?

అది ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డే చెప్పాలి. సీఎం, డిప్యూటీ సీఎంలు ఇద్దరూ తమ నియోజకవర్గాలైన కొడంగల్, మధిరలో ఇంటర్నేషనల్ గురుకులాల ఏర్పాటుకు పూనుకున్నారు. విద్యార్థులకు ఎలా ప్రవేశాలు కల్పిస్తారు? ఎవరి ద్వారా పాఠ్యాంశాలను బోధిస్తారు? తదితర వాటికి సంబంధించి ఇప్పటివరకు మార్గదర్శకాలైతే లేవు. బయట వినిపిస్తున్న దాని ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ ఇలా అన్ని గురుకులాలను ఒకేచోట ఏర్పాటు చేస్తామంటున్నారు. గతంలో మైఎస్ హయాంలో ఇలాగే ఇంటిగ్రేటెడ్ గురుకులాలను ఏర్పాటు చేశారు. అదొక విఫల ప్రయోగం. కేసీఆర్ నూతన విధానాలతో గురుకులాలను ఏర్పాటు చేశారు. అది విజయవంతమైంది. ఇంటర్నేషనల్ గురుకులాలను ఏర్పాటు చేయడం కాదు, దమ్ముంటే కేసీఆర్ స్థాపించిన గురుకులాలను ఇంటర్నేషనల్ స్థాయికి తీసుకెళ్లాలి.

నర్సింగ్‌లో అబ్బాయిలకూ అవకాశం ఇస్తారా?

- వివిధ కోర్సుల్లో అడ్మిషన్ల కోసం ఎదురుచూపు
- హాస్టల్ లేదంటూ నిరాకరిస్తున్న ప్రిన్సిపాళ్లు
- డే-స్కాలర్‌గా అయినా వస్తామంటున్న విద్యార్థులు

హైదరాబాద్, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ): బీఎస్సీ నర్సింగ్‌లో అబ్బాయిలకు కూడా అవకాశం ఇవ్వాలని ఉత్తర్వులు ఉన్నా.. దశాబ్దాలుగా అమలు కావడం లేదు. హాస్టల్ లేదన్న కారణంతో అడ్మిషన్లు ఇవ్వడానికి నర్సింగ్ కాలేజీల ప్రిన్సిపాళ్లు నిరాకరిస్తున్నారు. ఏటా బీఎస్సీ నర్సింగ్ అడ్మిషన్లకు ముందు 'ఈ ఏడాది బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో అబ్బాయిలను (మేల్ నర్సింగ్) చేర్చుకోవడానికి మీరు సిద్ధంగా ఉన్నారా?' అని కాళోజీ హెల్త్ యూనివర్సిటీ అడగడం.. 'హాస్టల్ లేదు కాబట్టి చేర్చుకోము' అంటూ ప్రిన్సిపాళ్లు సమాధానం ఇవ్వడం 2007 నుంచి ఇదే ఆనవాయితీగా వస్తున్నది. ఎంబీబీఎస్ అడ్మిషన్లకు పచ్చజెండా ఊపేలా గురువారం హైకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ఎంబీబీఎస్, బీడీఎస్, బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో అడ్మిషన్ల కోసం కాళోజీ యూనివర్సిటీ సిద్ధమవుతున్నది. ఈసారైనా ప్రభుత్వం తమకు బీఎస్సీ నర్సింగ్‌లో అవకాశం ఇవ్వాలని అబ్బాయిలు కోరుతున్నారు. హాస్టళ్లు నిర్మించలేకపోతే నిబంధనలు సవరించి కనీసం డే స్కాలర్‌గా అయినా అవకాశం ఇవ్వాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు, సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్నారు.

రెండు దశాబ్దాలుగా ఎదురుచూపు..

గతంలో బీఎస్సీ నర్సింగ్ కేవలం అమ్మాయిలకు మాత్రమే ఉండగా, 2005లో అబ్బాయిలకు కూడా అవకాశం కల్పిస్తూ ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం జీవో ఇచ్చింది. ఈ మేరకు 2006, 2007లో కొందరికి అవకాశం లభించింది. ఆ తర్వాత ఏడాది నుంచి హాస్టళ్లు లేవన్న కారణంతో అడ్మిషన్లను నిరాకరిస్తూ వస్తున్నారు. ప్రస్తుతం దేశ, విదేశాల్లో నర్సులకు మంచి డిమాండ్ ఉన్నది. జీఎన్ఎం (డిప్లొమా)లో అబ్బాయిలకు అడ్మిషన్లు ఇస్తున్నా, ఆ సర్టిఫికెట్‌కు పెద్దగా డిమాండ్ లేదు. బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేస్తే తమ భవిష్యత్తు బాగుపడుతుందని, ప్రభుత్వం ఈ ఏడాదైనా అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. నిబంధనలను మార్చి అమలు చేస్తే డేస్కాలర్‌గా అయినా అవకాశమివ్వాలని కోరుతున్నారు.

బడిపిల్లల పట్టుదల.. తలవంచిన సర్కార్

మొదటిపేజీ తరువాయి...

సీవోఈ (సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్), నాన్ సీవోఈలు, ప్రత్యేక గురుకులాలు, స్పోర్ట్స్ అకాడమీలు, ఒకేషనల్ గురుకులాల్లో పనిచేస్తున్న పార్ట్‌టైం, గెస్ట్‌ఫ్యాకల్టీ, సబ్జెక్ట్ అసోసియేట్లు, ఫిజికల్ డైరెక్టర్లు తదితరులందరినీ విధుల నుంచి తప్పించాలని ఇటీవలే సెక్రటరీ రాత్రికిరాత్రి ఉత్తర్వులు జారీచేశారు. అప్పటికే సదరు ఉద్యోగులకు 3 నెలలుగా వేతనాలను కూడా చెల్లించటం లేదు. జీతాలు చెల్లించకుండా, ముందస్తు సమాచారమివ్వకుండా, అకడమిక్ ఇయర్‌లో అర్ధాంతరంగా తొలగించటంతో వారంతా తీవ్ర ఆందోళనకు గురయ్యారు. వెంటనే ఉత్తర్వులను రద్దుచేసి తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సొసైటీ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. తుదకు మానవ హక్కుల కమిషన్‌కు సైతం ఫిర్యాదు చేశారు. 3 రోజుల నాటకీయ పరిణామాల తర్వాత ఎట్టకేలకు శుక్రవారం ముగింపు లభించింది. తొలగించిన పార్ట్‌టైం ఉద్యోగులందరినీ తిరిగి యథావిధిగా కొనసాగించాలని సొసైటీ సెక్రటరీ వర్షిణి ఆదేశాలు జారీచేశారు. జూమ్ మీటింగ్ ఏర్పాటు చేసి ప్రిన్సిపాల్స్, జోనల్ ఆఫీసర్లకు ఆదేశాలిచ్చారు.

ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలుపుతున్న ఫ్యాకల్టీ, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు

బీఆర్ఎస్‌కు, 'నమస్తే తెలంగాణ'కు ప్రత్యేక కృతజ్ఞతలు

రాత్రికిరాత్రే విధుల నుంచి తప్పించడంతో రోడ్డునపడ్డ ఫ్యాకల్టీకి బీఆర్ఎస్ నేతలు, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, జగదీశ్‌రెడ్డి, సబితాఇంద్రారెడ్డి బాసటగా నిలిచారు. ప్రభుత్వ నిర్ణయంతో దిక్కుతోచని స్థితిలో పడిపోయిన వారంతా మాజీమంత్రి హరీశ్‌రావును కలిసి తమ గోడును వెల్లబోసుకున్నారు. వారి పరిస్థితికి చలించిన ఆయన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగలేఖ రాశారు. తొలగించిన పార్ట్ టైమ్ లెక్చరర్లు, టీచర్లందరినీ వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, పెండింగ్ జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మాజీమంత్రులు జగదీశ్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, కొప్పుల ఈశ్వర్‌తోపాటు, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ గౌలిదొడ్డి సీవోఈని సందర్శించారు. ఆందోళన చేపట్టిన విద్యార్థులకు బాసటగా నిలిచారు. వెంటనే సబ్జెక్ట్ అసోసియేట్లను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒకవైపు బీఆర్ఎస్ ఒత్తిడి, మరోవైపు విద్యార్థులు, పార్ట్‌టైం ఉద్యోగుల ధర్నాతో ఎట్టకేలకు సర్కారు దిగివచ్చింది. ఈ సందర్భంగా పలువురు పార్ట్‌టైం ఉద్యోగులు బీఆర్ఎస్ పార్టీకి, 'నమస్తే తెలంగాణ' పత్రికకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సొసైటీ సెక్రటరీకి గురుకుల విద్యాజేఏసీ కృతజ్ఞతలు

గెస్ట్ ఫ్యాకల్టీని తిరిగి విధుల్లోకి తీసుకుంటూ ఉత్తర్వులు జారీచేయడంపై గురుకుల విద్యాజేఏసీ స్టీరింగ్ కమిటీ సభ్యులు హర్షం వ్యక్తంచేశారు. సొసైటీ సెక్రటరీ అలుగు వర్షిణికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మానవీయ కోణంలో స్పందించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. 3 నెలల బకాయి వేతనాలను కూడా సత్వరమే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. కృతజ్ఞతలు తెలిపినవారిలో గురుకుల విద్యా జేఏసీ స్టీరింగ్ కమిటీ సభ్యులు సీహెచ్ బాలరాజు, ప్రభుదాస్, బాలస్వామి, యాదయ్య, రుషికేశ్‌కుమార్, చలపతి తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ సర్కారులో గురుకులాలు నిర్వీర్యం

ప్రగతిశీల తల్లిదండ్రుల సంఘం

ఖైరతాబాద్, సెప్టెంబర్ 6: సాంఘిక సంక్షేమ గురుకులాలను కాంగ్రెస్ ప్రభుత్వ నిర్వీర్యం చేసే కుట్ర చేస్తున్నదని ప్రగతిశీల తల్లిదండ్రుల సంఘం విమర్శించింది. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో స్వేరోస్ ఇంటర్నేషనల్, ప్రగతిశీల తల్లిదండ్రుల సంఘం, స్వేరోస్ నెట్‌వర్క్ సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు మచ్చ నర్సయ్య, కార్యదర్శి సుంకరి వెంకటేశ్, కోకన్వీనర్ బానోతు రాంబాబు, స్టూడెంట్ ఫౌండేషన్ చైర్మన్ విజయ ఆర్య క్షత్రియులు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ఎస్సీ గురుకులాలపై కాంగ్రెస్ కక్ష కట్టిందని, విద్యార్థులకు చదువును దూరం చేస్తున్నదని మండిపడ్డారు. సమావేశంలో ప్రగతిశీల తల్లిదండ్రుల సంఘం రాష్ట్ర కన్వీనర్ చాపల సదానందం, మహిళా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లలితా రాణి, వెంకటేశ్, స్వేరోస్ ఇంటర్నేషనల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిలకబత్తిని వీరయ్య, ప్రకాశ్, గిరిజన విద్యార్థి సమాఖ్య అధ్యక్షుడు వెంకట్ బంజారా తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థుల ధర్నా

అధ్యాపక ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు ఆందోళన చేపట్టారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మున్సిపాలిటీలోని జయప్రకాశ్‌నగర్ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల ఎదుట శుక్రవారం బైఠాయించారు. 12 మంది గెస్ట్ లెక్చరర్స్‌కు 9 మందిని తొలగించారని, అధ్యాపకులు సరిపడా లేక విద్యా భ్యాసానికి తీవ్ర విఘాతం ఏర్పడుతుందని వాపోయారు. - కల్వకుర్తి

డీఎస్సీలో అదనపు మార్కులు

- ఫైనల్‌కీ విడుదల.. త్వరలో ఫలితాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో టీచర్ పోస్టుల భర్తీకి నిర్వహించిన డీఎస్సీ పరీక్షల నిర్వహణలో రేవంత్‌రెడ్డి సర్కారు ఫెయిలయ్యింది. డీఎస్సీ ప్రశ్నపత్రాల్లో అనేక తప్పులు దొర్లడమే ఇందుకు నిదర్శనం. జూలై 18న నిర్వహించిన ఎస్ఏ (సోషల్) మొదటి షిఫ్ట్‌లో ఒక ప్రశ్నకు ఆన్సర్ తప్పుగా ఉండగా, మూడు ప్రశ్నలకు ఇచ్చిన రెండు ఆప్షన్లను సరైన సమాధానంగా ప్రకటించారు. జూలై 30న ఎస్ఏ(సోషల్)మొదటి షిఫ్ట్ పరీక్షలో ఏకంగా 8 ప్రశ్నలకు సమాధానాలు తప్పుగా ఇచ్చారు. వారికి నాలుగు మార్కులు అదనంగా కలుస్తాయి. ఇక మరో ప్రశ్నకు రెండు ఆప్షన్లు సరైనవిగా ప్రకటించారు. వీరికి కూడా మార్కులు కలవనున్నాయి. కాగా, డీఎస్సీ ఫైనల్ కీ, రెస్పాన్స్‌షీట్లను విద్యాశాఖ శుక్రవారం విడుదల చేసింది. వారం, పది రోజుల్లో డీఎస్సీ ఫలితాలను విడుదల చేయనున్నది.

గురుకులంలో విద్యార్థుల వీరంగం

- బ్యాట్లతో కొట్టుకున్న వైనం

ఎల్లారెడ్డి రూరల్, సెప్టెంబర్ 6: రెండు వర్గాలుగా విడిపోయిన విద్యార్థులు ఇనుపపైపులు, క్రికెట్ బ్యాట్లతో కొట్టుకున్న ఘటన కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డిలోని సోషల్ వెల్ఫేర్ గురుకుల కళాశాలలో గురువారం రాత్రి చోటు చేసుకున్నది. ఇంటర్ సెకండియర్ చదువుతున్న ఓ విద్యార్థి చెడు వ్యసనాలకు లోనవ్వగా గమనించిన మరో విద్యార్థి ప్రిన్సిపాల్ నాగేశ్వరరావుకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఫిర్యాదు చేసిన విద్యార్థిపై మరో విద్యార్థి కక్ష పెంచుకున్నాడు. హిందీ అధ్యాపకుడు గురువారం రాత్రి గంటపాటు డ్యూటీలో ఉండి ఇంటికి వెళ్లిపోగా ఇదే అదనుగా భావించిన విద్యార్థుల బృందం అర్ధరాత్రి హాస్టల్‌లోని సీసీ కెమెరాలను ధ్వంసం చేసి దాడికి పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న ప్రిన్సిపాల్ గాయపడిన వారిని ఎల్లారెడ్డి దవాఖానకు తీసుకెళ్లి వైద్యం చేయించారు. ఆర్డీవో ప్రభాకర్, తహసీల్దార్ మహేందర్, సీఐ రవీందర్‌నాయక్, జోనల్ అధికారి ఫ్లోరెన్స్ రాణి ఘటనపై విచారణ చేపట్టారు.

రాష్ట్రంలో ఎడ్యుకేషనల్ ఎమర్జెన్సీ విధించాలి

- సంక్షోభంలో పాఠశాల విద్య
- టీడీఎఫ్ నివేదికలో ఆందోళనకర అంశాలు
- పాఠశాల విద్యలో భారీ సంస్కరణలు అవసరం
- సర్కారుకు తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం సూచన

హైదరాబాద్, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో పాఠశాల విద్య అత్యంత సంక్షోభంలో ఉన్నది.. బోధన అభ్యసన రంగాలు రోజురోజుకూ దిగజారుతున్నాయి.. ఈ సంక్షోభం నుంచి బయటపడేందుకు రాష్ట్రంలో ఎడ్యుకేషనల్ ఎమర్జెన్సీ (విద్యా అత్యయిక పరిస్థితి)ని విధించాలని 'తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం (టీడీఎఫ్) అభిప్రాయపడింది. పాఠశాల విద్యలో భారీ సంస్కరణలు అవసరమని ప్రభుత్వానికి ఓ నివేదికను సమర్పించింది. 'స్కూల్ ఎడ్యుకేషన్ ఇన్ తెలంగాణ స్టేట్-స్టేటస్ అండ్ సజెస్టెడ్ పాలసీ మెజర్స్' పేరుతో సంస్థ ఓ నివేదికను రూపొందించింది. ఆ నివేదికపై శుక్రవారం నారాయణ